

తన పుట్టినరోజు సందర్భంగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆయన సతీమణి కాలేరు పద్మతో కలిసి బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను మంగళవారం కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.
- గోల్నాక, డిసెంబర్ 10 ఆంధ్రజ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్ తదితరులు

మానవ హక్కుల పరిరక్షణ కోసం తిరుగుబాటు చేయాలి

కవాడిగూడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల పరిరక్షణ కోసం కార్పొరేట్ మాఫియాపై తిరుగుబాటు చేయాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కాన్ఫడరేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ వీఎల్ రాజు, సెక్రటరీ జనరల్ సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సదస్సుకు ఐహెచ్ఆర్సీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సీహెచ్ రాజేందర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిసెంబర్ 10న మానవ హక్కుల దినం అని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశంలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని వారు ఆరోపించారు. క్రైస్తవులు, సిక్కులు, దళితులు ఆదివాసీలపై అత్యాచారాలు దాడులు చేస్తూ మానవ హక్కులను ఉల్లంగిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ సదస్సులో హైకోర్టు న్యాయవాది శివరాణి, ఐహెచ్ఆర్సీ ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, గ్రేటర్ అధ్యక్షుడు డి సంధ్య ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, డీబీపీ గ్రేటర్ అధ్యక్షుడు మద్దెల ప్రవీణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బారావు, దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇటికాల గణేష్, నేషనల్ బీసీ రైట్స్ ప్రొటక్షన్ కౌన్సిల్ అధ్యక్షుడు కాసాని అశోక్‌కుమార్, సుచంద్ర, ప్రణిత పాల్గొన్నారు.



జీహెచ్ఎంసీ సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

రోడ్లపై మట్టికుప్పలను తొలగించాలి

బర్కత్‌పుర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్ పరిధిలో రోడ్లపై పేరుకుపోయిన చెత్త, మట్టికుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి అధికారులను ఆదేశించారు. మంగళవారం నింబోలిఅడ్డలోని డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గల్లీల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయని, వాటితో పాటు మట్టికుప్పలను కూడా తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ హేమలత, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి కనులపండువగా ఆకుపూజ

చిక్కడపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు, ఆకుపూజ, అర్చనలు కార్యక్రమాలు కనులపండువగా మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మాచర్ల దేవనాథం పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది బుగ్గా లక్ష్మీపతిశర్మ, కందాళ వెంకటాద్రితో పాటు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. ప్రజా పాలన, ప్రజావిజయోత్సవాల్లో భాగంగా ఈనెల 4వ తేదీ నుంచి జరుగుతున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి.

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

చిక్కడపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): డివిజన్ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా అధికారులు పని చేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందికి సూచించారు. డివిజన్ అభివృద్ధి పనులపై జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం డీఈ గీత, ఏఈ అబ్దుల్‌సలామ్‌లతో మంగళవారం మధ్యాహ్నం కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ తన కార్యాలయంలో భేటీ అయ్యారు. అభివృద్ధి పనులపై సమీక్ష చేశారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్ పాల్గొన్నారు.



అభివృద్ధిపై అధికారులతో సమీక్ష చేస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

గ్రంథాలయ నూతన చైర్మన్‌కు సత్కారం

చిక్కడపల్లి, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన కె.ఉపేందర్‌రెడ్డిని మంగళవారం రాత్రి సంస్థ సిబ్బంది సన్మానించారు. హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ ఆధ్వర్యంలో లైబ్రరీ సిబ్బంది అవినాష్‌రావు, సుకేష్‌కుమార్, వెంకటేష్‌యాదవ్, బొల్లం మహేందర్, వెంకటేశ్వర్‌రెడ్డి ఉపేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా.రియాజ్ పాల్గొన్నారు.



ఉపేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న పొట్లూరు పద్మజ తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న బెల్లం ధర్మారావు తదితరులు

బీసీ కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయాలి

రాంనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం బడ్జెట్‌లో ఒక్కొక్క బీసీ ఫెడరేషన్, కార్పొరేషన్‌లకు కేటాయించిన యాభై కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి అధ్యక్షుడు బెల్లం ధర్మారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ ఫెడరేషన్లు, కార్పొరేషన్లకు పాలక మండళ్లను ఏర్పాటు చేయాలని, ఎంబీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సమితి ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు వీరప్ప. ఉపాధ్యక్షులు షేక్ సయ్యద్ భాషా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కె కిరణ్‌కుమార్, నాయకులు లింగయ్య సునీత సదానందం, కిరణ్‌చారి, చందులాల్ పాల్గొన్నారు.

చెత్త లారీ ఢీకొని వ్యక్తి మృతి

కుషాయిగూడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెత్తలారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా, చెన్నారావుపేట మండలం, పాపాయపేట తండాకు చెందిన బడావత్ సుమన్(35) ప్రైవేటు ఉద్యోగి. మంగళవారం చర్లపల్లి పారిశ్రామికవాడలో చక్రీపురం వైపునకు బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన చెత్త లారీ ఢీకొట్టింది. బైక్‌పై నుంచి కిందపడిన సుమన్ తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు గాంధీ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శేఖర్ తెలిపారు.

డ్రైనేజీ వేశారు.. గుంతలు మిగిల్చారు

- కవాడిగూడ అరవింద్‌నగర్ కాలనీలో అధ్వానంగా రోడ్లు
- నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కవాడిగూడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నూతనంగా డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేసి రోడ్డుకు మరమ్మతులను చేయడం మరిచారు. ఫలితంగా రోడ్డు అస్తవ్యస్తంగా, గుంతలమయంగా మారింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా 20 రోజులుగా అరవింద్‌నగర్ కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో పరిస్థితి మరీ దారుణంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ఉద్యోగాలు, కాలేజీలు, వివిధ పనుల మీద బయటకు వెళ్లి వచ్చే వృద్ధులు, మహిళలు గుంతలమయంగా మారిన రోడ్డువల్ల ప్రమాదాలకు గురవుతున్నారు.

కవాడిగూడ డివిజన్ అరవింద్‌నగర్ కాలనీలో ఇటీవల రూ.20 లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్ ఆధునికీకరణ పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్, స్థానిక కార్పొరేటర్ జి రచనశ్రీ, వివిధ శాఖల అధికారులతో కలిసి పనులను ప్రారంభించారు. అయితే పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం పూర్తి చేశాడు. కానీ తరువాత రోడ్డును చదును చేయకుండా వదిలేశాడు. ఫలితంగా రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. గుంతల రోడ్డు కారణంగా తాము ఇబ్బందులు పడుతున్నామని మరమ్మతులు చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను కాలనీవాసులు సంప్రదిస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌పై తగు చర్యలు తీసుకుని రోడ్డుకు మరమ్మతులు చేయించాలని చేయించాలని వారు కోరుతున్నారు.



అరవింద్‌నగర్‌కాలనీలో గుంతలమయంగా మారిన రోడ్డు

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



అరవింద్‌నగర్‌కాలనీలో డ్రైనేజీ కోసం రోడ్డును తవ్వి వదిలేశారు. రోడ్డు గుంతలమయంగా మారింది. దాదాపు 20 రోజులుగా గుంతల రోడ్లతో ఇబ్బందులు పడుతున్నాం. మరమ్మతులు చేయాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలి.
- ఎ ప్రభాకర్, దోమలగూడ నివాసి

సమస్య పరిష్కారానికి కృషి చేస్తా



అరవింద్‌నగర్‌లో డ్రైనేజీ నిర్మాణం వల్ల తవ్విన రోడ్లకు మరమ్మతులు చేపట్టేవిధంగా సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా. కాంట్రాక్టర్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడం దారుణం. అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలి.
- జి రచనశ్రీ, కవాడిగూడ కార్పొరేటర్

రోడ్డు మరమ్మతు పనులకు వెంటనే చర్యలు

డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. గుంతలమయమైన రోడ్లతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఫిర్యాదు చేశారు. పైప్‌లైన్ వేసిన తరువాత మట్టి పోయడం జరిగింది. వెంటనే రోడ్డు మరమ్మతులు ప్రారంభించాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించాం. రేపటి నుంచే రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను ప్రారంభిస్తాం.
- సుప్రజ, దోమలగూడ వాటర్‌వర్క్స్ మేనేజర్

టీడీపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడికి పితృ వియోగం

రాంనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్ తండ్రి డి విఠల్‌గౌడ్(71) మంగళవారం ఉదయం తెల్లవారుజామున చిక్కడపల్లిలోని ఆయన నివాసంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు చంద్రమోహన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, లావణ్య సంతానం ఉన్నారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం సాయంత్రం గోల్నాక శ్మశానవాటికలో జరిగాయి. ఆయన అంత్యక్రియల్లో మాజీ ఎంపీ అల్లాడి రాజ్‌కుమార్, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా. ప్రధాన కార్యదర్శులు పలుస బాల్‌రాజ్‌గౌడ్, నల్లెల కిషోర్, మాజీ కార్పొరేటర్ వాజిద్‌హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు లోకేష్‌యాదవ్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

బర్కత్‌పుర: తమిళనాడు నుంచి కూతురు ఇంటికి వచ్చిన ఓ మహిళ తిరుగు ప్రయాణంలో అదృశ్యమైంది. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడులోని సేలంకు చెందిన కన్నన్ భార్య ప్రేమ్‌వల్లి(46) కొండాపూర్‌లో నివాసం ఉంటున్న కుమార్తె సుప్రితను చూడటానికి వచ్చింది. తిరుగు ప్రయాణంలో ఈనెల 8న ప్రేమ్‌వల్లి సేలం వెళ్లడానికి కాచిగూడ రైల్వేస్టేషన్‌కు కూతురుతో వచ్చి నాగర్‌కోయల్ ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగిలో ఎక్కించింది. కానీ ప్రేమ్‌వల్లి సేలం చేరలేదు. దీంతో కుమార్తె మంగళవారం కాచిగూడ రైల్వేపీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

మానవ హక్కులను కాపాడుకోవాలి

బర్కత్‌పుర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులను కాపాడుకోవాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి చంద్రయ్య అన్నారు. భారత రాజ్యాంగం ప్రజలకు అనేక హక్కులను కల్పించిందన్నారు. మంగళవారం బర్కత్‌పురాలోని ఆర్‌బీవీఆర్‌ఆర్ ఫార్మసి కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా హైకోర్టు న్యాయవాది డాక్టర్ ఎం.ధనుంజయనాయక్‌కు హ్యూమన్ రైట్స్ ఎక్స్‌లెన్సీ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ జి.చంద్రయ్య మాట్లాడుతూ.. భూమిపై పుట్టిన ప్రతీ మనిషికి సమాన హక్కులు, గౌరవం అందాలన్నదే అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ లక్ష్యమని అన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ పిఎస్ నారాయణ మాట్లాడుతూ.. ప్రతీ వ్యక్తి సమాజంలో గౌరవంగా జీవించడానికి కావాల్సిన దుస్తులు, నివాసం, ఆహారం, నీరు, వైద్యం, సంరక్షణ, భద్రత వంటివి పొందే హక్కు కలిగి ఉంటారని వివరించారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.రాజ్‌నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ.. న్యాయవాదిగా రాణిస్తున్న డాక్టర్ ధనుంజయ నాయక్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశామని చెప్పారు. ఈ సందర్భంగా శాలువా, జ్ఞాపిక, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవి తేజ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుమాకాంత్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధ, డాక్టర్ ఎంపి కుసుమ, మనోజ్ జైన్, నవ భారతి నిర్మాణ్ ఫౌండేషన్ అధ్యక్షుడు బత్తుల హేమంత్, రెడ్డి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి అచ్యుతాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి విజయలక్ష్మి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ధనుంజయనాయక్‌కు అవార్డును ప్రదానం చేస్తున్న జస్టిస్ చంద్రయ్య

సమానత్వం కోసం మహిళలు ముందుకు సాగాలి

ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ నాయకురాలు ఝాన్సీ

రాంనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్మికవర్గ పోరాటంలో శ్రామిక మహిళలు ముందు భాగంలో ఉంటూ పితృస్వామ్య వ్యవస్థ అంతం కోసం సమానత్వ సమాజం, దోపిడీ, పీడనలేని నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించే దిశగా అడుగులు వేయాలని ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ నాయకురాలు టి.ఝాన్సీ పిలుపునిచ్చారు. మంగళవారం ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపులో భాంగా ఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'కార్మికవర్గం పోరాటంలో మహిళల పాత్ర' అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సదస్సుకు ఝాన్సీ హాజరై మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లోనూ ముందువరుసలో ఉంటున్నప్పటికీ వారిని పితృస్వామ్య వ్యవస్థ అడుగడుగునా అణిచివేస్తూనే ఉన్నదని, అనేక విషయాల్లో పురుషాధిక్య పెత్తనందే చెల్లుబాటు అవుతోందని అన్నారు. మహిళలపై నిత్యం వివక్ష, అవమానం, అర్ధనగ్నంగా ఊరేగించడం, అత్యాచారాలు, హత్యలకు దోపిడీ వ్యవస్థ పాల్పడుతూనే ఉందన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకురాలు హరిత అధ్యక్షత వహించగా ఆర్ జనార్దన్, అరుణక్క, వై.గీత, గంటా నాగయ్య బ్రహ్మానందం, శంకర్, విజయలక్ష్మి, జానీబేగం, పద్మ, అలివేలు, రాజకళ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీ



తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న వి.శ్రీనివాస్‌రెడ్డి, కార్తీక్ యాదవ్

కాంగ్రెస్ తల్లి విగ్రహమే..

- మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించిన విగ్రహం కాంగ్రెస్ తల్లి విగ్రహమే అని మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్పుపై నిరసన వ్యక్తం చేస్తూ ముషీరాబాద్ నియోజకవర్గం విద్యార్థి విభాగం కోఆర్డినేటర్ కార్తిక్‌యాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు అద్దం పట్టే విగ్రహాన్ని తీసివేసి కాంగ్రెస్ గుర్తుతో ఉన్న విగ్రహం ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి విగ్రహాన్ని మార్పులు, చేర్పులు చేశారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు అజయ్ ముదిరాజ్, పార్టీ సీనియర్ నాయకులు సిరిగిరి శ్యామ్, బాలరాజుగౌడ్, సదా, రాజు, సత్యనారాయణ, సిద్దిక్, వెంకటేష్, అరుణ్, అమిత్, రాజు పాల్గొన్నారు.

- **శివాలయం చౌరస్తాలో..**

శివాలయం చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహం మార్పుపై నిరసన వ్యక్తం చేస్తూ తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నేతలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్‌నాయకులు శివముదిరాజ్, తలారి శ్రీకాంత్ ముదిరాజ్, వీరేష్, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు బింగి నవీన్, రహీం, మహ్మద్ అలీ, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.



శివాలయం చౌరస్తాలో క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

లష్కర్ జిల్లా ఏర్పాటుకు కృషి చేస్తా

మాజీ ఎంపీ వి హనుమంతరావు

రాంనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): లష్కర్ జిల్లా ఏర్పాటు అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి జిల్లా ఏర్పాటయ్యేలా తన వంతు కృషి చేస్తానని మాజీ ఎంపీ వి హనుమంతరావు (వీహెచ్) తెలిపారు. లష్కర్ జిల్లాను ఏర్పాటు చేయాలని కోరుతూ లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం వీహెచ్‌ను బాగ్ అంబర్‌పేటలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లష్కర్ జిల్లా సాధన సమితి విజ్ఞప్తి మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి తన పరంగా లేఖ రాయడంతో పాటు క్యాబినెట్ మంత్రులతో కలిసి విన్నవిస్తానని హామీ ఇచ్చారు. లష్కర్ జిల్లా ఏర్పాటు కావాలని మెజార్టీ ప్రజలు కోరుకుంటున్నందున వారి కోరికను కాంగ్రెస్ ప్రభుత్వం పరిశీలిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. లష్కర్ జిల్లా సాధన కోసం ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ ప్రజా ప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందజేస్తున్నామని తెలిపారు. త్వరలోనే సీఎంని కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యదవ్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణాగౌడ్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంబుల శ్రీకాంత్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె రాజేశ్వర్‌రావు, డివిజన్ అధ్యక్షుడు గడ్డం శ్రీధర్‌గౌడ్, చందుపటేల్, లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు బాలరాజ్ యాదవ్, శైలేందర్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



వీహెచ్‌కు వినతిపత్రం ఇస్తున్న పవన్‌కుమార్‌గౌడ్ తదితరులు

ఆగివున్న బైక్‌ను ఢీకొట్టిన కారు

బాలికకు గాయాలు

హైదర్‌నగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆగివున్న బైక్‌ను వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న బాలిక కిందపడగా తీవ్ర గాయలయ్యాయి. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రగతీనగర్‌కు చెందిన మేడూరి అశోక్ చక్రవర్తి మంగళవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరువూరు నుంచి వస్తున్న తన భార్య, కుమార్తెను ఇంటికి తీసుకెళ్లేందుకు వచ్చాడు. జేఎన్‌యూటీ వద్ద ద్విచక్రవాహనంపై కుమార్తె స్వేచ్ఛను ఎక్కించి భార్యాభర్త బైక్ ఎక్కుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు వీరి బైక్‌ను ఢీ కొట్టింది. కిందపడిన స్వేచ్ఛకు తీవ్రగాయాలు కాగా హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు. స్థానికులు కారు నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించగా మద్యం మత్తులో ఆక్సిడెంట్ చేసినట్టుగా పోలీసులు గుర్తించారు. అశోక్ చక్రవర్తి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



అయ్యప్ప స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, నిర్వాహకులు

అందరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలి

ముషీరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నక్క శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడి పూజ కార్యక్రమం ముషీరాబాద్ చేపల మార్కెట్ సమీపంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహలు హాజరై అయ్యప్పస్వామికి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అందరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారులకు భిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. జంగిరెడ్డి గురుస్వామిచే నిర్వహించిన భజన కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో నాయకులు మహేందర్ బాబు గౌడ్, అజయ్, సుమిత్ర, ఎయిర్‌టెల్ రాజు పాల్గొన్నారు.

హింసకు వ్యతిరేకంగా ఐద్వా ర్యాలీ

'హింసను వ్యతిరేకిద్దాం.. మహిళా హక్కులను కాపాడదాం' అనే నినాదంతో మంగళవారం బాగ్‌లింగంపల్లిలో ఐద్వా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఐద్వా రాష్ట్ర నాయకులు లక్ష్మితో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.
- రాంనగర్, ఆంధ్రజ్యోతి



దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ అమలు చేయాలి

కవాడిగూడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచి వెంటనే పంపిణీ చేయాలని పలు పార్టీలు, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి నేటికీ అమలు చేయడం లేదని వారు ఆరోపించారు. 2016 ఆర్‌పీడీ చట్టం గుర్తించిన 21 రకాల వైకల్యాలలో పాత ఏడు వైకల్యాలకే సర్టిఫికెట్లు ఇస్తూ కొత్తగా 14 రకాలకు సర్టిఫికెట్లు జారీ చేయడం లేదని వారు ఆరోపించారు. దివ్యాంగులకు పెన్షన్ రూ.6 వేలు పెంచాలని, అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, దివ్యాంగుల చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో నేషనల్ ప్లాట్‌ఫారం ఫర్ ది రైట్స్ ఆఫ్ ది డిసేబుల్డ్ (వికలాంగుల హక్కుల జాతీయ వేదిక) ఎన్‌పీఆర్‌డీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో దివ్యాంగులు మహాధర్నా నిర్వహించారు. ఈ మహాధర్నాలో మాజీ ఎమ్మెల్యే సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.జ్యోతి, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకర్గం అధ్యక్షుడు, దివ్యాంగులు కార్పొరేషన్ మాజీ చైర్మన్ పి సాయిబాబాలు హాజరై మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏడాది పాలన ముగిసిన సందర్భంగా విజయోత్సవాలు జరుపుకుంటున్నారనీ, కానీ దివ్యాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని వారు ఆరోపించారు. ఎన్ పిఆర్‌డి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కె వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య. రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్‌లు మాట్లాడుతూ దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు ఆరు వేల పింఛన్ అమలు చేయాలని కోరారు. మహాధర్నాలో రాజు, నాగలక్ష్మి, దశరథ్, యశోద, కాశప్ప, లింగయ్య, ఆరిఫా, బస్వరాజుస్వామి, గంగాధర్‌తో పాటు వివిధ జిల్లాల నుంచి దివ్యాంగులు పాల్గొన్నారు.



మహాధర్నాలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

చేనేతను గాలికొదిలి విజయోత్సవాలు సరికాదు

మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు

రాంనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల ఉపాధి లేక చేసిన కష్టానికి తగిన ఆదాయం లేక అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతూ కుటుంబ పోషణ భారమై ఆత్మహత్యలకు, ఆకలిచావులకు గురవుతున్నారని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చేనేత కార్మికుల రాష్ట్ర సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీతారాములు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. చేనేత పరిశ్రమను గాలికి వదిలేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏడాది పాలన విజయోత్సవాలు చేసుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈనెలలో చేనేత కార్మికుల సమస్యలపై జాతీయస్థాయి పోరాటాలు చేయడానికి నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రమేష్, మురళీధర్, స్వామి, రాజేష్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాములు